
నీటి నిల్వలో దోమల మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది


జీవీఎంసీ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మలేరియా సిబ్బంది


దోమల నిర్మూలనకు మెగా ఫాగింగ్

ముందు జాగ్రత్తలే మందు

- అవగాహనతోనే డెంగ్యూ దూరం
- దోమల వృద్ధిని అరికడితేనే ఆరోగ్యం
- విస్తృతంగా నిర్మూలన చర్యలు


దోమ లార్వాలు పెరుగుతున్న నీటిని పారబోస్తున్న సిబ్బంది


అక్కయ్యపాలెంలో స్థానికులకు డెంగ్యూపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

సీతంపేట: వర్షా కాలం వచ్చిందంటే దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా జ్వరాలు పొంచి ఉన్నట్టే. దోమ కుట్టడం ద్వారా వ్యాపించే జ్వరాల్లో డెంగ్యూ అతి ప్రమాదకరమైనది. జ్వరం వచ్చాక రక్త పరీక్ష చేయించుకోవడం, చికిత్స ఆలస్యమైతే మరణానికి దారి తీయవచ్చు. ఏటా జూన్ నుంచి అక్టోబర్ వరకు నగరంలో డెంగ్యూ జ్వరాలు ఎక్కువగా సంభవిస్తుంటాయి. ఈ కాలంలో వర్షాలు ఎక్కువగా కురవడం, నీరు ఎక్కడపడితే అక్కడ నిల్వ ఉండటానికి అవకాశాలు అధికంగా ఉండటంతో ఇడిస్ దోమలు వృద్ధి చెందుతాయి. ఇవి కుట్టడం వల్ల డెంగ్యూ జ్వరం వస్తుంది. కొద్ది పాటి అవగాహనతో ముందు జాగ్రత్తలు పాటిస్తే ఈ జ్వరం బారిన పడకుండా ఉండవచ్చు. ఈ మేరకు నియోజకవర్గంలోని జోన్‌ల పరిధిలో జీవీఎంసీ, మలేరియా విభాగం అధికారులు దోమల నిర్మూలనకు విస్తృతంగా చర్యలు చేపడుతున్నారు. కాలనీలు, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

దోమలు ఎక్కడ పెరుగుతాయంటే..

డెంగ్యూ జ్వరం బారిన పడకుండా ఉండాలంటే దోమలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమం. ఇటీవల విస్తారంగా కురిసిన వర్షాలకు దోమలు వృద్ధి చెందడంతో డెంగ్యూ జ్వరాలు నమోదవుతున్నాయి. వారానికి ఒక రోజు డ్రైడే పాటిస్తే దోమల పెరుగుదలను నియంత్రించవచ్చు. ఇంటి పరిసరాల్లో వర్షపు నీటి నిల్వలు, ఖాళీ సీసాలు, కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ వస్తువులు, టైర్లు, రుబ్బురోలు, తాగి పాడేసిన టీ కప్పులు, బాటిళ్లు, ఫ్రిజ్ వెనుక డ్రిప్ బాక్స్, కూలర్లు, మనీ ప్లాంట్లలో దోమలు పెరుగుతాయి. నీటిని నిల్వ చేసే గోళాలు, కుండీలు, డ్రమ్ములు, ట్యాంకులు తదితర వాటిలో వారానికి పైగా నీటి నిల్వల్లో దోమలు చేరి గుడ్లు పెడతాయి. ఒక్క దోమ 200 నుంచి 250 గుడ్ల వరకు పెడుతుంది. ఇవన్నీ 10 నుంచి 12 రోజుల్లో దోమలుగా వృద్ధి చెంది జ్వరాలను వ్యాప్తి చేస్తాయి.

డెంగ్యూ హాట్‌స్పాట్స్..

సచివాలయాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని, గత మూడేళ్లలో మూడు కంటే ఎక్కువ డెంగ్యూ పాజటివ్ కేసులు నమోదైన సచివాలయాన్ని హాట్‌స్పాట్‌గా గుర్తించారు. ఆయా హాట్‌స్పాట్స్‌లో కేసులు నమోదు కాకుండా జీవీఎంసీ యంత్రాంగం, జిల్లా మలేరియా విభాగం ప్రత్యేక కార్యాచరణతో దోమల నిర్మూలనకు పనిచేస్తున్నారు. గతేడాది కంటే డెంగ్యూ కేసుల సంఖ్య ఈ ఏడాది తగ్గుముఖం పట్టినప్పటికీ రానున్న మూడు నెలలు డెంగ్యూ వ్యాధికి అనుకూలంగా ఉండే వాతావరణం కావడంతో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తే మేలని అధికారులు సూచిస్తున్నారు.

ప్రజలకు విస్తృత అవగాహన



ప్రతి ఏటా జూన్ నుంచి అక్టోబర్ వరకు డెంగ్యూ, మలేరియా జ్వరాల ఉధృతి కొనసాగుతుంది. వీటికి కారణమైన దోమల వృద్ధిని అరికడితేనే జ్వరాలను నియంత్రించగలం. జీవీఎంసీ యాంటీ లార్వా సిబ్బంది, సచివాలయ ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, జిల్లా మలేరియా విభాగం ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఫ్రైడే–డ్రైడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి దోమ లార్వాలు పెరుగుతున్నట్టు గుర్తించిన నీటిని పారబోస్తున్నారు. దోమలు పెరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. దోమల నిర్మూలనను సామాజిక బాధ్యతగా తీసుకుని ప్రతి ఒక్కరూ తమ ఇంటి నుంచి చర్యలు మొదలుపెట్టాలి. – నగేష్ పట్నాయక్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్

ఇలా చేస్తే మేలు..

- దోమలు పెరగకుండా ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్త వహించాలి.
- వారానికి ఒక రోజు డ్రైడే పాటించి నీటిని నిల్వ చేసే పాత్రలు, గోళాలు, కుండీలు, డ్రమ్ములను శుభ్రం చేసి ఆరబెట్టి మళ్లీ నీరు పట్టుకోవాలి.
- నీటిని నిల్వచేసే గోళాలు, కుండీలు, ట్యాంకులపై మూతలు పెట్టాలి.
- ఫ్రిజ్ వెనుక డ్రిప్ బాక్స్, కూలర్లను వారానికి ఒకసారి శుభ్రం చేయాలి.
- నీటిలో దోమ లార్వాలు పెరుగుతున్నట్టు గుర్తిస్తే ఆ నీటిని మట్టి లేదా ఇసుకలో పారబోయాలి.
- దోమలు కుట్టకుండా శరీరాన్ని పూర్తిగా కప్పేలా దుస్తులు ధరించాలి.
- ఇంటికి వచ్చే యాంటీ లార్వా సిబ్బందికి సహకరించి దోమల పెరుగుదలను నియంత్రించాలి.

రైల్వే స్టేషన్‌లో డీఆర్‌ఎం ఆకస్మిక తనిఖీలు


టీటీఈ రెస్ట్ హౌస్‌లో తనిఖీలు చేస్తున్న డీఆర్‌ఎం లలిత్ బోహ్రా

తాటిచెట్లపాలెం: ఉద్యోగులు, సిబ్బంది భద్రత, సంక్షేమం కోసం కృషి చేస్తూ రాత్రి వేళల్లో సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు, పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు డీఆర్‌ఎం లలిత్ బోహ్రా ఆదివారం అర్ధరాత్రి విశాఖ రైల్వే స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. టీటీఈ రెస్ట్ హౌస్, బుకింగ్ కార్యాలయంతోపాటు హెరిటేజ్ రిటైరింగ్ రూంలు, స్లీపింగ్ పాడ్స్ వంటి ప్రాంతాల్లో సిబ్బంది వసతులు, ప్రమాణాలను పరిశీలించారు. ఈ ప్రాంతాల్లో సిబ్బందితో డీఆర్‌ఎం ముఖాముఖి మాట్లాడారు. ఏ సమస్యలున్నా తనకు తెలియజేయాలని, అవసరమైన సూచనలు చేయవచ్చన్నారు. ఆకస్మిక తనిఖీల వల్ల వాస్తవ పరిస్థితులను తెలుసుకునే అవకాశం ఉంటుందని డీఆర్‌ఎం తెలిపారు. సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం


అర్జీలు పరిశీలిస్తున్న జోన్–5 కమిషనర్ రాము

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 13 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము స్వీకరించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ విభాగానికి 06, ఇంజినీరింగ్‌కు 05, రెవెన్యూకు 01, పబ్లిక్ హెల్త్‌కు 01 చొప్పున అర్జీలు అందినట్లు తెలిపారు. ప్రజా ఫిర్యాదుల తక్షణ పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను జెడ్సీ ఆదేశించారు. రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈలు తారా ప్రసన్నరెడ్డి, డీఈ భరణికుమార్, వాటర్ ఏఈ సుమన్, ఏపీడీవో కృపానందం, పి.పుణ్యవతి, జనార్దనరావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శిశువుల ఎదుగుదలకు తల్లిపాలు శ్రేష్ఠం


ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, సీడీపీవో నీలిమ, మహిళలు

మర్రిపాలెం: శిశువుల ఎదుగుదలకు తల్లిపాలు(ముర్రుపాలు) ఎంతో శ్రేష్ఠమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ అన్నారు. వార్డులోని గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్బన్ సీడీపీవో కె.నీలిమ గర్భిణులు, బాలింతలకు పలు సూచనలిచ్చారు. బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలు ఇవ్వడం ద్వారా పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందని, బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానమని వివరించారు. తల్లిపాలలో బిడ్డకు అవసరమైన పోషకాలు సంవృద్ధిగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో భాగంగా బ్యానర్లు ప్రదర్శిస్తూ 'తల్లిపాలు ముద్దు – డబ్బా పాలు వద్దు' అనే నినాదంతో ర్యాలీ చేశారు. సూపర్‌వైజర్ జ్యోతి, ఎం.ఎస్.కె.స్వాతి, అంగన్‌వాడీ టీచర్ మాలా బీబీ, ఏఎన్‌ఎం మేరీ, ఆశ వర్కర్ వెంటకలక్ష్మి, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

250 అడుగుల జాతీయ జెండా వితరణ


ఎన్‌జీజీవోస్ కాలనీ హైస్కూల్‌కు జెండాను అందజేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

సీతంపేట: రోటరీ క్లబ్ విశాఖ స్మార్ట్ సిటీ 250 అడుగుల పొడవైన జాతీయ జెండాను సోమవారం అక్కయ్యపాలెం ఎన్‌జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ హైస్కూల్‌కు అందజేసింది. క్లబ్ అధ్యక్షుడు వేణు, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ రవికుమార్, మెంబర్ సురేష్ చేతుల మీదుగా పాఠశాల హెచ్‌ఎం జయంతి రాధాకుమారికి జెండాను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ 250 అడుగుల జాతీయ పతాకాన్ని తమ స్కూల్‌కు రోటరీ క్లబ్ అందజేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఆగస్టు 15, రిపబ్లిక్ డే వంటి ముఖ్య దినాల్లో జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తామని, పిల్లల్లో దేశభక్తి పెంపొందించడాని పలు కార్యక్రమాలు రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ ఎం.ఎన్.వి.విశ్వనాథం, పీడీ రత్నం, పేరెంట్ కమిటీ చైర్మన్ అప్పలరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


నీలాపు వెంకటరమణ

అల్లిపురం: విధులకని వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఆరిలోవకు చెందిన నీలాపు వెంకటరమణ జీవీఎంసీ స్వీపర్‌గా డాబాగార్డెన్స్ ప్రాంతంలో పనిచేస్తుంటాడు. జూలై 19న విధులకు హాజరయ్యేందుకు డాబాగార్డెన్స్ మహిళా కళాశాల వెనుక వీధిలోకి వెళ్లాడు. ఆ రోజు నుంచి తిరిగి ఇంటికి రాకపోవడంతో అతడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నీలాపు వెంకటరమణ 5 అడుగుల ఎత్తు కలిగి, నలుపు రంగులో ఉంటాడని పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 70934 83898, 94409 04716 ఫోన్ నంబర్లలో తెలియజేయాలని కోరారు.

ప్రతి వ్యక్తికి ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్

డాబాగార్డెన్స్: ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ ప్రతి వ్యక్తి వద్ద ఉండాలని మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశాల మేరకు సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజారోగ్య విభాగం అధికారులు నాన్ కమ్యూనికబుల్ డిసీజ్(ఎన్‌సీడీ) స్క్రీనింగ్ పరీక్షలు, ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీవీఎంసీ ఉద్యోగులు, పీజీఆర్‌ఎస్‌కు వచ్చిన ఫిర్యాదుదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఈ హెల్త్ గుర్తింపు కార్డులో వ్యక్తి ఆరోగ్య పరీక్షలు, మందులు మొదలైనవి నిక్షిప్తమై ఉంటాయని, తద్వారా ఆరోగ్య సమస్యలు ఏర్పడినప్పుడు ఏ ఆస్పత్రికి వెళ్లిన ఈ కార్డు చూపిస్తే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వీలుంటుందన్నారు. పీజీఆర్‌ఎస్‌కు వచ్చిన వారికి ఎన్‌సీడీ స్క్రీనింగ్ టెస్టులు బీపీ, సుగర్ వంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. నగరంలోని ప్రతి పౌరుడికి ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

పని ప్రదేశాల్లో మహిళల భద్రతకు చర్యలు

- వాల్తేర్ డివిజన్‌లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం


రైల్వే మహిళా గ్యాంగ్‌కు భద్రతపై అవగాహన కల్పిస్తున్న టీం సభ్యులు

తాటిచెట్లపాలెం: పని ప్రదేశాల్లో మహిళా ఉద్యోగులకు భద్రతతో కూడిన గౌరవప్రదమైన వాతావరణం కల్పించేందుకు వాల్తేర్ డివిజన్ సోమవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం ప్రారంభించింది. డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా, సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ జూసుఫ్ కబీర్ అన్సారీల నేతృత్వంలో ఈ బృందం సిబ్బందిపై లైంగిక వేధింపులు, హక్కులు, విధుల గురించి అవగాహన కల్పిస్తారు. ప్రతి ఉద్యోగికి ప్రత్యేకంగా మహిళా ఉద్యోగులకు ఎటువంటి భయం, ఆందోళన లేకుండా చేయడమే వాల్తేర్ డివిజన్ లక్ష్యమని డీఆర్‌ఎం లలిత్ బోహ్రా ఈ సందర్భంగా తెలిపారు.

కార్యక్రమంలో భాగంగా నాలుగు నిబద్ధత గల కమిటీలు ఏర్పాటు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఇవి డివిజన్ పరిధిలోని ఆయా రైల్వే స్టేషన్లు, పనిచేసే ప్రదేశాల్లో పర్యటించి మహిళా ఉద్యోగులకు వారి విధుల్లో ఎదురయ్యే లైంగిక వేధింపులపై పలు కీలక సూత్రాలను తెలియజేస్తారన్నారు. ఈ బృంద సభ్యులు మహిళల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతూ వేధింపుల సమయంలో ఎలా ఎదుర్కోవాలో వివరిస్తారని చెప్పారు. అవగాహన కార్యక్రమాలు, సెమినార్లు, ముఖాముఖి కార్యక్రమాలు వంటివి అన్ని విభాగాల్లోనూ నిర్వహిస్తారని పేర్కొన్నారు. బాధితుల పక్షాన నిలబడి, ఫిర్యాదుల నమోదులో వారికి అవసరమైన సహాయం చేస్తారని తెలిపారు. తొలి రోజు పలు రైల్వే స్టేషన్లలో రైల్వే మహిళా గ్యాంగ్‌కు పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులను ఎదుర్కోవడంపై టీం సభ్యులు అవగాహన కల్పించారు.

10 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన తనిఖీల్లో ఓ నిందితుడిని అదుపులోకి తీసుకుని, 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఎస్.రామారావు, ఆర్పీఎఫ్ ఏఎస్‌ఐ పి.శివనారాయణలు స్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు నిర్వహించారు. ఒడిశా రాష్ట్రం గుణుపూర్‌కు చెందిన ప్రదీప్ దులిబస్క విశాఖ రైల్వే స్టేషన్ మీదుగా గంజాయిని అక్రమంగా రవాణా చేయడాన్ని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి రూ.50 వేల విలువైన 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయ నాయుడు తెలిపారు.

క్రమబద్ధమైన ఆహారంతో ఆరోగ్యం


మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసరావు

మురళీనగర్: ఆహారాన్ని క్రమబద్ధంగా టైమ్ ప్రకారం తీసుకున్నప్పుడే ఆరోగ్యం మెరుగుపడుతుందని ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ టి.శ్రీనివాసరావు అన్నారు. మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పొందూరు ప్రభావతి అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం, సాయంత్రం వేళల్లో భోజనం తినేటప్పుడు సకాలంలో తీసుకోవాలన్నారు. సమయానికి భోజనం చేయకపోడవం వల్లే అనేక అనారోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. డయాబెటిస్, కీళ్ల వాతం, థైరాయిడ్, క్యాన్సర్ వంటి రోగాలు రావడానికి గల కారణాలను వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసరావును క్లబ్ మహిళలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ పూర్వ అధ్యక్షురాలు జె.ఉమాదేవి, కార్యదర్శి జయ, కోశాధికారి కె.భానుమతి, సంయుక్త కార్యదర్శి జి.శిరీషలత, సంయుక్త కోశాధికారి ఎం.ప్రమీలరావు, సభ్యులు పాల్గొన్నారు.

యూజీ రీసెర్చ్ కౌన్సిల్ ఏర్పాటుకు చర్యలు


కార్యక్రమంలో పాల్గొన్న ఏయూ వీసీ రాజశేఖర్, విభాగాధిపతులు

మద్దిలపాలెం: పోటీ ప్రపంచంలో విజేతగా మారాలంటే విద్యా సంబంధిత అంశాల్లో రాజీ పడొద్దని.. ప్రతిభ చూపాల్సిన అవసరం ఉందని ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. బీచ్ రోడ్‌లోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా ఇంజినీరింగ్ కళాశాల ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. విద్యార్థులు భవిష్యత్‌లో పరిశోధన రంగంలో రాణించే దిశగా తీర్చిదిద్దడం కోసం ప్రత్యేకంగా యూజీ రీసెర్చ్ కౌన్సిల్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. విద్యార్థులు నాలుగేళ్ల తర్వాత తాము పొందాలనుకునే భవిష్యత్ కోసం ప్రణాళిక తయారు చేసుకుని నిరంతరం కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా నూతన కరికులం తయారుచేసి అమలు చేస్తున్నామని చెప్పారు. అదే సమయంలో విద్యార్థులను తల్లిదండ్రులు నిరంతరం పరిశీలించాలని సూచించారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు మాట్లాడుతూ 8 వేల మంది విద్యార్థులతో ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ దేశంలోనే అత్యుత్తమ కళాశాలల్లో ఒకటిగా నిలుస్తోందని చెప్పారు. 14 బీటెక్ కోర్సులు, 27 ఎంటెక్ కోర్సులను 17 విభాగాల ద్వారా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ర్యాగింగ్ రహితంగా ఇంజినీరింగ్ కళాశాలను తీర్చిదిద్దామని వివరించారు. మెరుగైన ఉపాధి అవకాశాలతోపాటు స్టార్టప్, విదేశాల్లో ఉన్నత విద్యకు తమ విద్యార్థులు వెళ్లడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతులు, హాస్టల్ వార్డెన్లు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు


నిత్య కల్యాణంలో జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి సోమవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన సేవ ఘనంగా జరిపారు. ఉదయం 9.30 నుంచి నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

విశేషంగా గరుడ సేవ

సింహగిరి అప్పన్నకు సోమవారం గరుడ సేవ విశేషంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని వెండి గరుడ వాహనంపై వేంజేపజేశారు. అర్చకులు అష్టోత్తర శతనామావళి పూజ చేసి, విశేష హారతులిచ్చారు. పూజలో పాల్గొన్న భక్తులను గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు


చెక్కు అందిస్తున్న దాత సూర్యప్రకాశరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి తగరపువలసకు చెందిన ఉప్పాడ బాల ఆదిత్యరెడ్డి రూ.లక్ష విరాళాన్ని నగదు రూపంలో సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయంలో సోమవారం అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు ఈవో వి.త్రినాథరావు బాండ్ అందించారు. నగరంలోని మహారాణిపేటకు చెందిన కె.సూర్యప్రకాశరావు, శ్రీలక్ష్మి దంపతులు రూ.లక్ష విరాళాన్ని చెక్కు రూపంలో పీఆర్వో కార్యాలయంలో ప్రొటోకాల్ విభాగం సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు అందించారు. దేవస్థానం తరఫున దాతలకు అధికారులు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. కార్యక్రమంలో పీఆర్వో అప్పలనాయుడు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ ట్రోఫీ ఆవిష్కరణ

ఎంవీపీ కాలనీ : సూపర్ కిక్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఇన్విటేషన్ ఏపీ స్టేట్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ – 2025 పోటీల ట్రోఫీని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆవిష్కరించారు. ఎంవీపీ కాలనీ సెక్టార్ – 4లోని ఆయన కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. పోటీలు ఈ నెల 10న ఏయూ ఇండోర్ స్టేడియంలోని కిక్ బాక్సింగ్ రింగ్ వేదికగా జరగనున్నట్లు సంస్థ చైర్మన్ పి.శ్రీనివాస్ వెల్లడించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో సూపర్ కిక్స్ క్లబ్ ప్రతినిధులు, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

శ్రావణలక్ష్మికి విశేష పూజలు


శ్రావణలక్ష్మి పూజలు చేస్తున్న వేదపండితులు, అర్చకులు, పాల్గొన్న ఉభయదాతలు

డాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రావణ మాస పూజలు 12వ రోజుకు చేరాయి. సోమవారం ఉదయం 8 గంటలకు వేదపండితులు, అర్చకులు, వేదమంత్రాలు, నాదస్వర సుస్వరాల మధ్య శ్రీలక్ష్మి పూజలు ప్రారంభించారు. పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టుల ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.400 చెల్లించాలని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నేడు అష్టదళ పద్మారాధన

కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు.

ఎన్‌సీసీ శిక్షణతో భవితకు నిచ్చెన



'బి' సర్టిఫికెట్లతో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లకు సోమవారం 'బి' సర్టిఫికెట్లు అందజేశారు. ఎన్‌సీసీలో శిక్షణ పొందిన 19 మందికి ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల చేతుల మీదుగా సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎన్‌సీసీ శిక్షణ యువతకు శారీరక, మానసిక స్థైర్యాన్ని పెంపొందించే గొప్ప వేదికని అన్నారు. 'బి' సర్టిఫికెట్ విద్యార్థుల కెరీర్‌కు పునాది వేసే ముఖ్య అడుగని క్యాడెట్లను అభినందించారు. ఎన్‌సీసీ క్యాడెట్లు సేవా భావం, క్రమశిక్షణ, జాతీయతతో కళాశాల గౌరవాన్ని పెంచాలని కాలేజీ ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ కె.గీతాంజలి ఆకాంక్షించారు. కార్యక్రమంలో డి.అరుణపద్మ, డాక్టర్ ఆర్.కిరణ్మయి, ఎల్.శరణ్య, క్యాడెట్లు పాల్గొన్నారు.